
సాక్షి
బాపట్ల
శనివారం । 12 । అక్టోబర్ । 2024



దుర్గాదేవిగా కనకదుర్గమ్మ

రాజుపాలెం: మండలంలోని ఇనిమెట్ల గ్రామంలో కనకదుర్గ అమ్మవారి దేవాలయంలోని అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు.



ప్రత్యేక అలంకారంలో రాజ్యలక్ష్మి

చేబ్రోలు: చేబ్రోలులోని ఆదికేశవస్వామి దేవస్థానంలో శుక్రవారం రాజ్యలక్ష్మి అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.



పనులు పరిశీలన

ఫిరంగిపురం: మండలంలోని శిరంగిపాలెం, రేపూడి గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను నేషనల్ లెవల్ మానిటరింగ్ టీం సభ్యులు శుక్రవారం పరిశీలించారు.

న్యూస్‌రీల్

ఉత్కంఠగా రాష్ట్రస్థాయి పోలు రాధ ఎడ్ల పందేలు



చీరాల అర్బన్: రాష్ట్రస్థాయి పోలు రాధ ఎడ్ల పందేలు ఉత్కంఠగా సాగుతున్నాయి. వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ ప్రసాదనగరంలో దసరా పండుగ సందర్భంగా శుక్రవారం ఎడ్ల పోటీలు నిర్వహించారు. ప్రసాదనగరం కమిటీ ఆధ్వర్యంలో రైతులందరూ కలిసి నిర్వహించిన పోటీల్లో రాష్ట్రంలోని కృష్ణా, అనంతపురం జిల్లాలతోపాటు పలు జిల్లాల నుంచి 20 జతల ఎడ్లు పాల్గొన్నాయి. క్వింటాన్నర బరువును పది నిమిషాలలో లాగాలన్నది పోటీలో నిబంధన పెట్టారు. పోటీలను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి ఎక్కువ మంది హాజరయ్యారు. పోటీలలో మొదటి ఐదు బహుమతులు అందించనున్నారు.

300 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

జే.పంగులూరు: రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. అందిన వివరాల మేరకు.. సాధారణ తనిఖీల్లో శుక్రవారం సివిల్ సప్‌లై అధికారులు అద్దంకి, జే.పంగులూరు మండలంలోని పలు రైస్ మిల్లులను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కశ్యాపురం గ్రామంలో గల స్వప్న రైస్ మిల్లులో అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో అక్రమంగా నిల్వచేసిన 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. బియ్యాన్ని సీజ్ చేసి, రైస్ మిల్లు యజమానిపై 6–ఎ, క్రిమినల్ కేసు నమోదు చేశామని సప్‌లై డీఎస్‌వో విలియమ్స్ తెలిపారు. రేషన్ బియ్యం ఎక్కడైనా అక్రమంగా నిల్వచేసినా, అక్రమంగా రవాణా చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీలో సివిల్ సప్‌లై అధికారులు గీతారాణి, షఫి, అబ్రహం పాల్గొన్నారు.

జయ జయహే మహిషాసురమర్దని



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి క్షేత్రంలో శ్రీ దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా శుక్రవారం బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో బాలచాముండేశ్వరి అమ్మవారిని మహిషాసురమర్దనిదేవిగా అలంకరించారు. దసరా వేడుకలలో తొమ్మిదో రోజు ఆశ్వీయుజశుద్ధ నవమి శ్రవణానక్షత్రం మహర్నవమి సందర్భంగా మహిషాసురమర్దని అలంకారంలో బాలచాముండేశ్వరి అమ్మవారు భక్తుల పూజలందుకున్నారు. అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, దేవీ ఖడ్గమాల, త్రిశల, లలితాసహస్ర నామార్చన, శ్రీ చక్రార్చన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్దని అమ్మవార్లకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి సీతాసమేత శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలోని ప్రత్యేక మండపంలో మహిషాసురమర్దనిదేవి అలంకారం చేశారు. గ్రామంలోని భక్తులు పెద్దసంఖ్యలో మూడు దేవాలయాలను సందర్శించి పూజలలో పాల్గొన్నారు.



విజయోస్తు

విశ్వవినోదినికి భక్త నీరాజనం
- పెరిగిన భవానీల రద్దీ
- నేడు పూర్ణాహుతితో ముగియనున్న దసరా ఉత్సవాలు
- చివరి రోజు శ్రీరాజరాజేశ్వరీదేవిగా దుర్గమ్మ
- సాయంత్రం జలవిహారం చేయనున్న ఆది దంపతులు

ఉదయమంతా భక్తితన్మయత్వం.. సాయంత్రం సాంస్కృతిక వైభోగం.. వెరసి ఇంద్రకీలాద్రి ఆధ్యాత్మిక సుగంధాలు వెదజల్లింది. వేల సంఖ్యలో తరలివచ్చిన భవానీలతో కొండ సిందూర శోభితమైంది. జగన్మాత కనకదుర్గమ్మ తొమ్మిదో రోజు శుక్రవారం మహిషాసురమర్దనిగా దర్శనమిచ్చారు. శక్తిస్వరూపిణిని దర్శించుకుని భక్తకోటి తరించింది. విజయదశమి నాడు ఆది దంపతుల జలవిహారానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.



మహిషాసురమర్దనిగా దుర్గమ్మ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ శుక్రవారం శ్రీమహిషాసురమర్దనీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారికి విశేష అలంకరణ, పూజా కార్యక్రమాల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. శనివారంతో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియనుండటంతో పెద్దఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. తెల్లవారుజాము నుంచి ఒకే రీతిలో రద్దీ కనిపించింది. మరో వైపున భవానీల తాకిడి పెరిగింది. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భవానీలు కొండ పైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటున్నారు. మహా మండపం దిగువన, పాత మెట్ల మార్గంలో దేవస్థానం ఏర్పాటు చేసిన పాయింట్లలో ఇరుముడులను సమర్పిస్తున్నారు. శుక్రవారం సుమారు 5 వేల మంది కి పైగా భవానీలు ఇరుముడులను సమర్పించినట్లు ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

అర్చకులకు సత్కారం..

మహామండపం ఆరో అంతస్తులో శుక్రవారం అర్చక సత్కార సభను నిర్వహించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని అర్చకులను సత్కరించి వారికి పురస్కారాలను అందజేశారు. సభలో 175 మంది అర్చకులకు రూ.4,500చొప్పున నగదు, శేషవస్త్రాలు, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సత్యనారాయణ, దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమ్మ సన్నిధిలో పలువురు ప్రముఖులు..

శ్రీమహిషాసురమర్దనీదేవిగా దుర్గమ్మను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, సినీ నటి అనన్య నాగళ్ల, నిర్మాత కె.అశోక్‌కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ప్రముఖులను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు.

నగరోత్సవం.. కోలాహలం..



ఆది దంపతుల నగరోత్సవ సేవ కోలాహలంగా సాగింది. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాల వద్ద శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ భక్త జనుల కోలాట నృత్యాలు, రంగు రంగుల విద్యుత్ దీపకాంతుల మధ్య ఊరేగింపు ముందుకు సాగింది. అమ్మవారిని దర్శించుకుని కొండ దిగువకు చేరుకున్న భక్తులు పల్లకీపై తమ మధ్యకు వచ్చిన ఆది దంపతులకు పూజలు నిర్వహించారు. మహామండపం, కనకదుర్గనగర్, రథం సెంటర్, కెనాల్‌రోడ్డు, ఘాట్‌రోడ్డు మీదగా అమ్మవారి ఆలయానికి నగరోత్సవం చేరుకుంది. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట ఆది దంపతులకు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

దుర్గగుడిపై నేడు

- తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభం
- 5 గంటలకు ప్రత్యేక ఖడ్గమాలార్చన
- ఉదయం 7 గంటలకు, 10 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన
- 8 గంటలకు ప్రత్యేక శ్రీచక్రనవార్చన
- 8 గంటలకు ప్రత్యేక చండీహోమం
- 11 గంటలకు మహా పూర్ణాహుతి
- 12 గంటలకు మహా నివేదన
- సాయంత్రం 5 గంటలకు నగరోత్సవం
- 6 గంటలకు దుర్గాఘాట్‌లో హంసవాహనంపై తెప్పోత్సవం

ముగిసిన దరఖాస్తుల ప్రక్రియ

117 దుకాణాలకు.. 2103 దరఖాస్తులు

- నగటున ఒక్కొక్క దుకాణానికి 18 దరఖాస్తులు
- అత్యధికంగా ఇంకొల్లు మండలంలో నగటున 46 దరఖాస్తులు
- అత్యల్పంగా అద్దంకి రూరల్‌లో 9 దరఖాస్తులు
- రేపల్లె రూరల్‌లో 9 దరఖాస్తులు
- ప్రభుత్వానికి రూ.42.06 కోట్ల ఆదాయం
- పచ్చనేతలు, సిండికేట్ల దౌర్జన్యంతో తగ్గిన దరఖాస్తులు



సాక్షి ప్రతినిధి,బాపట్ల: మద్యం దుకాణాలకు దరఖాస్తుల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. గడువు ముగిసే సమయానికి జిల్లాలోని 117 మద్యం దుకాణాలకు 2103 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 1న మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించిన ప్రభుత్వం తొలుత ఈనెల 9 వరకు గడువు విధించింది. పచ్చనేతలు, వారి సిండికేట్ మద్యం దుకాణాలకు మద్యం వ్యాపారులు, ఆశావహులను దరఖాస్తులు వేయకుండా అడ్డుకోవడంతో దరఖాస్తులు అనుకున్న స్థాయిలో రాలేదు. దీంతో ప్రభుత్వం ఈ నెల 11తేదీ వరకు దరఖాస్తులకు గడువు పెంచింది. దీంతో జిల్లాలోని 117 మద్యం దుకాణాలకు శుక్రవారం నాటికి మొత్తం 2103 దరఖాస్తులు (సగటున 18) వచ్చాయి. అత్యధికంగా ఇంకొల్లు మండలంలో మూడు దుకాణాలు ఉండగా సగటున ఒక్కొక్క దుకాణానికి 46 దరఖాస్తులు రాగా అత్యల్పంగా అద్దంకి రూరల్ పరిధిలో మూడు దుకాణాలకుగాను సగటున ఒక్కొక్క దుకాణానికి 8 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఆ తర్వాత రేపల్లె రూరల్ పరిధిలో సగటున ఒక్కొక్క దుకాణానికి 9 దరఖాస్తులు మాత్రమే రాగా సంతమాగులూరు, కొల్లూరు మండలాల్లోని దుకాణాలకు సగటున 10 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

దరఖాస్తుల ద్వారా రూ.42.06 కోట్ల రాబడి

జిల్లాలోని 117 మద్యం దుకాణాలకు మొత్తం 2103 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కొక్క దరఖాస్తుకు నాన్ రీఫండబుల్ రుసుం రూ.2 లక్షల చొప్పున ప్రభుత్వానికి చెల్లించారు. ఈ లెక్కన మొత్తం దరఖాస్తులకు కలిపి రూ.4206 కోట్లు రాబడి వచ్చింది.

ముందుకురాని దరఖాస్తుదారులు

జిల్లాలో పచ్చనేతల భయంతో మద్యం వ్యాపారులు, ఆశావహులు మద్యం దుకాణాలకు దరఖాస్తులు వేసేందుకు భయపడ్డారు. తమకు తెలియకుండా మద్యం షాపులకు దరఖాస్తులు వేయకూడదన్న పచ్చనేతల బెదిరింపులతో ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది. దీంతో జిల్లాలోని రేపల్లె, అద్దంకి, వేమూరు, చీరాల, బాపట్ల నియోజకవర్గాల్లో దరఖాస్తులు చాలా తక్కువగా పడ్డాయి. గతంలో ఒక్కో మద్యం దుకాణానికి 20 నుంచి 30 దరఖాస్తులు రాగా ప్రస్తుతం పర్చూరు నియోజకవర్గం మినహా అన్ని నియోజకవర్గాల్లో దరఖాస్తులు తక్కువగా వచ్చాయి. ఎట్టకేలకు మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ ముగిసింది. ఈనెల 14న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ విధానం ద్వారా మద్యం దుకాణాలు కేటాయించనున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున
- భూషయ్య కుటుంబానికి రూ.5లక్షల చెక్కు అందజేత
- కేసును నిష్పక్షపాతంగా విచారించాలి

నగరం:కార్యకర్తలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున చెప్పారు. మండలంలోని తాడివాకవారిపాలెం పంచాయతీ పరిధిలోని దాసరిపాలెంలో ఇటీవల టీడీపీ గూండాల చేతిలో హత్యకు గురైన నున్నా భూషయ్య కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన రూ.5లక్షల చెక్కును శుక్రవారం కుటుంబసభ్యులకు అందించారు. నాగార్జున మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ భూషయ్య కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారన్నారు. రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని అందించినట్లు తెలిపారు. భూషయ్య హత్య కేసులోని నిందితులందరికి శిక్ష పడేలా పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేయాలన్నారు. నిందితులకు అధికార పార్టీ నేతలు అండగా ఉండి కేసును నీరుగార్చే విధంగా కుట్రలకు పాల్పడుతున్నట్లు భూషయ్య కుటుంబసభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. గ్రామంలో మరో ఇద్దరి చంపుతామని టీడీపీ నేతలు అంటున్నారని గ్రామస్తులు నాగార్జునకు విన్నవించారు. పోలీస్ ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేలా కృషి చేస్తానని గ్రామస్తులకు నాగార్జున హామీ ఇచ్చారు. నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ మాట్లాడుతూ టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అరాచక పాలన సాగిస్తుందన్నారు. భూషయ్య కుటుంబ సభ్యులకు రూ.5లక్షల చెక్కు అందజేశారు. నాయకులు యార్లగడ్డ మదన్‌మోహన్, చెరుకుపల్లి ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, చిమటా బాలాజీ, ఐ.రామకృష్ణ, ఎస్ కోటేశ్వరరావు ఉన్నారు.



భూషయ్య కుటుంబ సభ్యులకు రూ.5లక్షల చెక్కు అందజేస్తున్న మేరుగ నాగార్జున, గణేష్

క్లుప్తంగా

చెడుపై మంచి సాధించిన గెలుపే విజయదశమి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



గుంటూరు ఎడ్యుకేషన్: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమిని నిర్వహించుకుంటారని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా సురేష్ కుమార్ పేర్కొన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని ఆమె శుక్రవారం ఉమ్మడి జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. విజయదశమి నేపథ్యంలో ప్రజలందరికీ ఆ దుర్గాదేవి చల్లని దీవెనలు ఉండాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

గుంటూరు రేంజ్ ఐజీ దసరా శుభాకాంక్షలు

నగరంపాలెం: గుంటూరు రేంజ్‌లోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లాలోని ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బందికి రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి శుక్రవారం ఒక ప్రకటనలో విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఐజీ ఆకాంక్షించారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపాలి



నగరంపాలెం: జిల్లాలోని బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. జిల్లాలో ఈ నెల 5వ తేదీ నుంచి మొదలైన వెట్టి చాకిరీ, బాల కార్మికుల గుర్తింపు ప్రత్యేక డ్రైవ్ శుక్రవారంతో ముగిసింది. జిల్లాలో మెకానిక్, బేకరీలు, హోటల్స్, సూపర్ బజార్, ఇతరత్రా దుకాణాల్లో పనిచేసే పలువురు బాల కార్మికులను గుర్తించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. 18 ఏళ్ల లోపు వారితో పని చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. బాలల హక్కులకు భంగం కలిగించవద్దని పేర్కొన్నారు. బడి బాట పట్టేలా తల్లిదండ్రులు చూడాలని, నేటి పిల్లలే భావి భారత పౌరులు అని అన్నారు. బాల కార్మికులుగా గుర్తించిన పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించి, కౌన్సెలింగ్ చేశారు. డీసీఆర్‌బీ సీఐ బి.నరసింహారావు, మహిళా ఏఎస్ఐ బేబీరాణి, కార్మికశాఖ సహాయ అధికారులు, పారా లీగల్ వలంటీర్లు, బచ్‌పన్ బచావో ఆందోళన్ స్టేట్ సమన్వయకర్త తిరుపతిరావు, సీఆర్ఎఫ్ జిల్లా సమన్వయకర్త సమీర్‌కుమార్, చైల్డ్ హెల్ప్‌లైన్ నిర్వాహకులు సరిత, నవీన్ పాల్గొన్నారు.

షూటింగ్‌లో గుంటూరు నగర వాసి ప్రతిభ



లక్ష్మీపురం: ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్ (ఐఎస్ఎస్ఎఫ్) ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీలలో గుంటూరు నగరానికి చెందిన ముఖేష్ నేలవల్లి అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలలో 5 స్వర్ణ, 2 కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఒకే ఈవెంట్లో అత్యధిక పతకాలు సాధించిన క్రీడాకారుడిగా ముఖేష్ గుర్తింపు పొందారు. 2024 వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన ముఖేష్ నేలవల్లి శనివారం స్వస్థలానికి చేరుకున్న సందర్భంగా ద ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ డైరెక్టర్ అండ్ చీఫ్ కోచ్ నాగిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు, తల్లిదండ్రులు శ్రీనివాసరావు, మాధవి, బంధుమిత్రులు, అకాడమీ షూటర్స్ విజయవాడ రైల్వే స్టేషన్లో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖేష్‌ను సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ మృతి



మేదరమెట్ల: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన ఆక్సిజన్ ఖాళీ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఖాళీ ఆక్సిజన్ ట్యాంకర్ గుంటూరు నుంచి తడకు వెళ్తోంది. కొరిశపాడు ఫ్లైఓవర్ వద్ద ఓ లారీ మరమ్మతులకు గురై నిలిచిపోయింది. గురువారం అర్ధరాత్రి ట్యాంకర్ అదుపుతప్పి ఆ లారీని ఢీకొంది. దీంతో ట్యాంకర్ డ్రైవర్ అయిన బిహార్ వాసి దిలీప్ పాశ్వాన్ (43) దుర్మరణం పాలయ్యాడు. మేదరమెట్ల పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ రఫీ తెలిపారు.

ఇంటి తాళం పగలగొట్టి నగలు, నగదు చోరీ

కొల్లూరు: ఇంటికి వేసిన తాళం పగలగొట్టిన దుండగులు నగలు, నగదు చోరీ చేశారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. అనంతవరానికి చెందిన దొప్పలపూడి అనందరావు విజయవాడలో స్థిరపడ్డారు. అనంతవరంలోని గృహంలో ఉంటున్న ఆయన తల్లిదండ్రులు గుంటూరులోని కుమార్తె వద్దకు వెళ్లారు. గురువారం రాత్రి ఆ ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు తెలిసింది. శుక్రవారం ఉదయం పోలీసులను ఆశ్రయించారు. సుమారు రూ. 70 వేల విలువైన బంగారు, వెండి వస్తువులు, రూ. 25 వేల నగదు చోరీ అయ్యాయి. కొల్లూరు ఏఎస్ఐ అర్జున్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆలయాల్లో వరుస చోరీలు



ఆరుబయట బోడవాడ రామాలయం హుండీ

- హుండీల్లోని కానుకలను కాజేస్తున్న దొంగలు
- పోలీసులు నిఘా పెంచాలని భక్తుల డిమాండ్



కొత్తపాలెం పోలేరమ్మ ఆలయంలో హుండీ పగలగొట్టిన దృశ్యం

పర్చూరు (చినగంజాం): పోలీసుల నిఘా సక్రమంగా లేకపోవడంతో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. పర్చూరు మండలంలోని పలు గ్రామాల్లో నిఘా లేని దేవాలయాలే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్నారు. గురువారం అర్ధరాత్రి మండలంలోని కొత్తపాలెం, బోడవాడ గ్రామాల్లో ఇదే తరహాలో దొంగతనం చేశారు. కొత్తపాలెం పోలేరమ్మ అమ్మవారి ఆలయ ప్రధాన ద్వారం హుండీ పగులగొట్టి సుమారు రూ.40 వేలు నగదు దోచుకెళ్లినట్లు గ్రామస్తులు సమాచారం అందించారు. కొన్ని రోజుల క్రితం అమ్మవారి కొలుపులు నిర్వహించారు. దీంతో ఎక్కువ కానుకలు సమరి్పంచారు. చిన్నబోడవాడలోని రామాలయంలో హుండీ పగులగొట్టినా నగదు లేకపోవడంతో దొంగలు బయటపడేసి వెళ్లిపోయారు. ఇంకొల్లు మండలంలోని పావులూరు, ఇడుపులపాడు గ్రామాల్లోని ఆలయాల్లో కూడా ఇటీవల హుండీ దొంగతనాలు జరిగాయి. పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటు నమోదు చేసుకోవాలి

నిజాంపట్నం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో అర్హులు ఓటు నమోదు చేసుకోవాలని యుటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్ బాపయ్య తెలిపారు. నిజాంపట్నంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఓటరు నమోదు కార్యక్రమాన్ని మండల రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కాశేపల్లి గౌరీశంకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్, ఫొటో, ఆధార్‌కార్డుతో ఆన్‌లైన్ ద్వారా ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2021 అక్టోబర్ 31వ తేదీలోపు డిగ్రీ లేదా డిప్లొమో చేసిన వారందరూ ఫారం 18 ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సీహెచ్ గణేష్‌రావు, నాయకులు అబుల్ మాలిక్, ఏడుకొండలరావు, నర్రా నాగభూషణం, డి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నమోదును ప్రారంభిస్తున్న సీహెచ్ బాపయ్య, కాశేపల్లి గౌరీశంకర్

స్వేచ్ఛగా మద్యం షాపులకు దరఖాస్తులు

- ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ రెడ్డి
- గడువు ముగిసే వేళకు క్రోసూరు పరిధిలో 310 దరఖాస్తులు



మాట్లాడుతున్న రవికుమార్‌రెడ్డి

క్రోసూరు: మద్యం షాపులకు ఔత్సాహికులు స్వేచ్ఛగా దరఖాస్తు చేసుకునేలా ఎక్సైజ్ శాఖ అన్ని చర్యలు తీసుకుందని గుంటూరు ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ రెడ్డి తెలిపారు. మద్యం షాపుల దరఖాస్తుల ప్రక్రియ ఏవిధంగా జరుగుతుందో పరిశీలించేందుకు శుక్రవారం క్రోసూరుకు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎక్సైజ్ శాఖ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా పూర్తి ఏర్పాట్లు చేసిందన్నారు. ఎక్కడా సిండికేట్‌గా ఏర్పడటానికి అవకాశం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. అన్నిచోట్ల స్వేచ్ఛగా దరఖాస్తులు చేసుకుంటున్నారన్నారు. సాయంత్రం 7 గంటలకు గడవు ముగిసే సమయానికి 310 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలియచేశారు. ఆయన వెంట మంగళగిరి ఎస్టీఎఫ్ ఏసీ అధికారి సుధాకర్‌రెడ్డి, గుంటూరు ఎన్‌ఫోర్సుమెంట్ ఏఈఎస్ సూర్యనారాయణ, సీఐ రేఖ, క్రోసూరు సీఐ టి తులసి, ఎస్ఐ శ్రీనివాసరావు తదితరులున్నారు.

బాలికలు విద్యావంతులైతేనే రక్షణ

- జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం
- ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



బాలికకు చెక్కు అందజేస్తున్న డీఆర్వో వినాయకం

నరసరావుపేట: బాలికలు విద్యావంతులుగా ఎదిగి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఐసీడీఎస్ పీడీ ఉమామహేశ్వరి మాట్లాడుతూ పద్దెనిమిదేళ్లు నిండని బాలికలు అనారోగ్యం, పౌష్టికాహార లేమి, అవిద్య, హింస నుంచి రక్షణ పొందాల్సిన అవసరం ఉందన్నారు. వివక్ష కారణంగా అమ్మాయిలు హింసకు గురికావటం గమనిస్తూనే ఉన్నామన్నారు. ఈ ధోరణి మారాల్సిన అవసరం ఉందన్నారు. స్త్రీల పైన హింస తగ్గుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. అసిస్ట్ సంస్థ ప్రతినిధి దుర్గారాణి, గుడ్‌షెఫర్డ్ డైరెక్టర్ సిస్టర్ వెనరసి మాట్లాడుతూ విద్యతో పాటుగా కాలానుగుణమైన నైపుణ్యాలను అందిపుచ్చుకొని వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని కోరారు. బాల్య వివాహాలతో ఆడపిల్లల జీవితాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయని, వాటి నిలుపుదల అందరి బాధ్యతని తెలియజేశారు. డ్రాయింగ్, డిబేట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలికలకు రూ.10 వేల చొప్పున డీఆర్వో వినాయకం, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి చెక్కులు ప్రదానం చేశారు. వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలికలకు మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా శాలువాలు, మెమెంటోలను అందజేశారు. అక్షరాభ్యాసాలు, వెల్ బేబీ షో నిర్వహించారు. జీసీడీవో రేవతి, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సభ్యులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో గుంటూరు వాసుల అవస్థలు

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పట్టించుకోని అధికారయంత్రాంగం



సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద నిలిచిన వర్షపునీరు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. ముఖ్యంగా డొంకరోడ్డు (మూడు వంతెనలు), నెహ్రూనగర్, సంజీవయ్యనగర్, ఓల్డ్ క్లబ్ రోడ్డు, కోబాల్ట్‌పేట, కొరిటెపాడు, అరండల్‌పేట, బ్రాడీపేట, ఏటీ అగ్రహారం, కేవీపీ కాలనీ, యాదవుల బజార్, పాతగుంటూరు, సుద్దపల్లి డొంక, ఇజ్రాయేల్ పేట, ఆర్టీసీ కాలనీ తదితర ప్రాంతాల్లోని లోతట్టు కాలనీలు జలమయంగా మారాయి. రోడ్లపై నిలిచిన మురుగునీటిని బెయిల్ అవుట్ చేయడంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు విఫలమయ్యారు. అదీ కాక కాలువల్లో పూడిక సక్రమంగా తీయకపోవడంతో ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోయింది. ఆ మురుగునీటిలోనే వాహనదారులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. భారీ వర్షాలకు ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా సత్వర చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పూడిక తీసిన ప్రాంతాల్లోని ఓపెన్ అవుట్ ఫాల్ డ్రైన్ వద్ద ప్రమాద సూచికలు సూచిస్తూ ఎరుపు రంగు జెండాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో, రోడ్లపై నిలిచిన నీటిని వెంటనే బెయిల్ అవుట్ చేసేలా సచివాలయ కార్యదర్శులు, స్థానిక అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

కాకుమానులో 34.2 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గుంటూరు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా కాకుమాను మండలంలో 34.2 మిల్లీ మీటర్లు నమోదైంది. అత్యల్పంగా తాడేపల్లి మండలంలో 0.6 మి.మీ. పడింది. సగటు 12.7 మి.మీ.గా నమోదైంది. మండలాల వారీగా.. ఫిరంగిపురం మండలంలో 30.2, పెదనందిపాడు 28.4, మేడికొండూరు 17.2, చేబ్రోలు 14.8, దుగ్గిరాల 12.6, వట్టిచెరుకూరు 12.6, గుంటూరు తూర్పు 12, తాడికొండ 11.8, కొల్లిపర 11.6, ప్రత్తిపాడు 10.4, తుళ్ళూరు 9.7, గుంటూరు పశ్చిమ 9.4, పొన్నూరు 7.4, మంగళగిరి 3.8, పెదకాకాని 1.2, తెనాలి మండలంలో మి.మీ. చొప్పున పడింది. అక్టోబర్ 11వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 45.9 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 31.3 మి.మీ. మాత్రమే నమోదైంది.

ఏసీఏ గ్రూప్-బి క్రికెట్ మ్యాచ్‌లు వాయిదా

వర్షంతో నిలిచిపోయిన శ్రీకాకుళం, అనంతపురం మ్యాచ్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఏసీఏ గ్రూప్-బి అండర్-14 బాలుర అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలను నిరవధికంగా వాయిదా వేశారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో పోటీలను వాయిదా వేస్తున్నట్టు ఏసీఏ ప్రతినిధులు శుక్రవారం ప్రకటించారు. కాగా ఇప్పటికే నిర్వహిస్తున్న శ్రీకాకుళం, అనంతపురం జిల్లాల మధ్య మ్యాచ్‌ను సైతం వర్షం కారణంగా నిలిపివేశారు. గురువారం నాటి ఓవర్‌నైట్ స్కోర్ 6 వికెట్లు నష్టానికి 91 పరుగులతో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన అనంతపురం జట్టు 104 పరుగులకు ఆలౌట్ అయింది. శ్రీకాకుళం బౌలర్లు జోస్మిత్ 3, ప్రేరణ్ 2 వికెట్లు సాధించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు ఒక వికెట్ కోల్పోయి 40 పరుగులు చేసింది. ఈదశలో వర్షం రావటంతో మ్యాచ్‌ను నిలిపివేశారు.

నిర్వహణ గ్రాంట్లు మంజూరు చేయాలి

– పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బంకా వాసుబాబు

సత్తెనపల్లి: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు నిర్వహణ గ్రాంటులను మంజూరు చేయాలని పీఆర్‌టీయూ (ఏపీ) జిల్లా ప్రధాన కార్యదర్శి బంకా వాసుబాబు డిమాండ్ చేశారు. సత్తెనపల్లిలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు సంవత్సరాలుగా జిల్లాలోని వివిధ యాజమాన్యాలలో పనిచేస్తున్న పాఠశాలలకు వాటి నిర్వహణకై ఇచ్చే గ్రాంట్లు విడుదల కాలేదన్నారు. ఇది ప్రధానోపాధ్యాయులకు భారంగా మారిందని, తక్షణమే 'పాఠశాలల నిర్వహణ గ్రాంటును' విడుదల చేయాలన్నారు. అలాగే నెలకు ఒకసారి నిర్వహించే స్కూల్ కాంప్లెక్స్ వేదికలను రొటేషన్ పద్ధతి పై కేటాయించాలని, సమగ్ర శిక్షలో పనిచేసే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దసరా కానుకగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలు, పీఆర్‌సీ, ఐఆర్ తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.శ్యామ్‌మోసెస్, ఉన్నారు.

మల్లాదిలో గల్లంతై.. ధరణికోటలో విగతజీవిగా తేలిన బాలుడు

అమరావతి: మండలంలో మల్లాది వద్ద కృష్ణానదిలో బుధవారం గల్లంతైన బాలుడి మృతదేహం శుక్రవారం ధరణికోట ఇసుకరీచ్ వద్ద తేలింది. పోలీసులు సమాచారం ప్రకారం మల్లాది ఎస్సీ కాలనీకి చెందిన నందూరు సామియేలు రాజు(16) బుధవారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి కృష్ణానదిలో ఈతకొడుతూ గల్లంతయ్యాడు. నదిలో మునిగిన సామియేలు రాజు కోసం బుధవారం, గురువారం గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకపోయింది. మల్లాది ఇసుక రీచ్‌లో మునిగిన బాలుడి మృతదేహం శుక్రవారం ధరణికోట ఇసుకరీచ్ వద్ద తేలిన విషయాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

కొల్లూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గాజుల్లంక కృష్ణా నది నుంచి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. రెండు ట్రాక్టర్లు శుక్రవారం తెల్లవారుజామున ఇసుకతో వెళుతుండగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. తర్వాత కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్రమ ఇసుక రవాణాపై కేసు నమోదు చేసి, కోర్టుకు పంపనున్నట్లు ఎస్ఐ జి. ఏడుకొండలు తెలిపారు.